క్లుప్తంగా

అంజన్నకు ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని అంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, సుళే కేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 5 గంటలకు అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకు పూజ, పంచామతాభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ డే


విద్యార్థికి ప్రశంసా పత్రం అందజేస్తున్న అధ్యాపకులు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శనివారం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, ఎన్ఎస్ఎస్ అధికారులు జొనాథన్, వెంకటరామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు గ్రామంలో కర్నూలు అమీలియో ఆస్పత్రి డాక్టర్లు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శనివారం సర్పంచ్ కొవరంజమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు కాల్వ లక్ష్మయ్య ఆధ్వర్యంలో హాస్పిటల్ కంటి వైద్య సిబ్బంది పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 25 మందికి ఆపరేషన్ అవసరం కావడంతో కర్నూలుకు రెఫర్ చేశారు. అలాగే మంత్రాలయం మండలం మాలపల్లి గ్రామంలో గ్రామ నాయకుడు సీతారామిరెడ్డి సమక్షంలో మహిళలు, వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మి, మల్లమ్మ, సరిత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం


నగదు అందిస్తున్న సర్పంచ్ పాల్దినకర్

కౌతాళం:వైఎస్సార్ బీమా పేదలకు వరం లాంటిదని కౌతాళం సర్పంచ్ పాల్దినకర్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన జంగం వీరభద్ర శనివారం ఉదయం మృతి చెందాడు. మృతునికి వైఎస్సార్ బీమా కింద రూ.10 వేల తక్షణ సాయం నామిని అయిన భార్య బాలరత్నమ్మకు అందజేశారు.కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, ఉప సర్పంచ్ తిక్కయ్య, మాజీ సర్పంచ్ అవతారం ,వెల్ఫేర్ అసిస్టెంట్ రాజేశ్వరి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

ఆదోని సెంట్రల్: స్థానిక జగనన్న కాలనీలో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాలను శనివారం హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రవికుమార్ పరిశీలించారు. మొదటి విడతలో 5,101 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 396 ఇళ్లకు మాత్రమే ఆర్సీ వేశామన్నారు. రూఫ్ లెవల్లో 47 ఇళ్లు, లింటల్ లెవల్లో 59 ఇళ్లు, బెస్మట్టం లెవల్లో 3,391 ఇళ్లు ఉన్నాయన్నారు. మరో 2,707 ఇళ్లు వివిధ దశలో ఉన్నాయన్నారు. వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

మద్యం విక్రేత అరెస్ట్


నిందితుడిని చూపుతున్న సెబ్ సీఐ హరిక్రిష్ణ

ఆదోని రూరల్: స్థానిక సిరుగుప్ప క్రాస్ రోడ్డు వద్ద ఆదోని పట్టణానికి చెందిన ఈరన్న శనివారం కర్ణాటక మద్యంతో పట్టుబడినట్లు సెబ్ సీఐ హరిక్రిష్ణ తెలిపారు. కర్ణాటక మద్యం ప్యాకెట్లు(240 ఓసీ డీలక్స్ విస్కీ) స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.సోదాల్లో సెబ్ ఎస్ఐ శివప్రసాద్, పీసీలు శ్రీనివాస్, సుధాకర్, ముని పాల్గొన్నారు.

ఏజెంట్ల సమష్టి కృషితోనే లాభాలు

కౌతాళం: ఏజెంట్ల సమష్టి కృషితోనే లాభాలు సాధ్యమని ఎల్ఐసీ కడప డివిజన్ ప్రొడక్ట్ మేనేజర్ రామకృష్ణ అన్నారు. శనివారం మండల ఏజెంట్లతో స్థానిక అమరప్పతాత మఠంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని ప్రైవేట్ కంపెనీలు వచ్చినా ఎల్ఐసీకి తిరుగులేదన్నారు. సమావేశంలో ఆదోని బ్రాంచ్ మేనేజర్ హనుమంతరావు, అసిస్టెంట్ మేనేజర్ ఖాజామైనుద్దీన్ పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి


విజేతలుగా నిలిచిన విద్యార్థులు

ఆదోని సెంట్రల్: గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని స్కూల్ గేమ్స్ కో ఆర్డినేటర్ నరసయ్య, సహాయ కో ఆర్డినేటర్ రామన్న సూచించారు. శనివారం స్థానిక పురపాలక ఉన్నత పాఠశాల ఆవరణంలో స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటమి పాలైన వారు నిరుత్సాహ పడరాదన్నారు. సాధన చేస్తే తప్పక విజయం దరిచేరుతుందన్నారు. అనంతరం విజేతలకు పురపాలక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఫయాజుద్దీన్, ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్నాయుడు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఈటీలు రామదాసు, ఓబన్న, అంజినమ్మ, నాగరాజు, చెన్నబసవ, యల్లమ్మ, నీరజమ్మ, సత్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

లాంగ్ జంప్

అండర్–14 బాలికల విభాగం: మానస(ఆరెకల్లు బీసీ గురుకులం), శ్రీవిద్య(ఆరెకల్లు ఎస్సీ గురుకులం), లావణ్య(బీసీ గురుకుల) వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

అండర్–17 విభాగం: మనీషా(ఆరెకల్లు బీసీ గురుకులం), మనేషా(ఆరెకల్లు బీసీ గురుకులం), సావిత్రి(ఎస్సీ గురుకుల) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు.


షాట్పుట్ వేస్తున్న విద్యార్థి


హైజంపు చేస్తున్న విద్యార్థిని

షాట్పుట్

అండర్–14 బాలుర విభాగం: ఎం.చరణ్(భాష్యం పాఠశాల), లక్ష్మీనరసింహ(పురపాలక ఉన్నత పాఠశాలకు), మల్లికార్జున(దొడ్డనగేరి పాఠశాలకు) వరుసగా మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు.

అండర్–17 విభాగం: శ్రీధర్(వింధ్యశ్రీ పాఠశాలకు), అభి(భాష్యం పాఠశాలకు), చైతన్య(నేషనల్ పాఠశాలకు) మొదటి, రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నారు.


లాంగ్ జంపు చేస్తున్న విద్యార్థిని

డిస్కస్ త్రో

అండర్–14 బాలికల విభాగం: శైలజ(దొడ్డనగేరి పాఠశాలకు), సుప్రియ్య(ఆరెకల్లు బీసీ గురుకులం), దీపిక(దొడ్డనగేరి పాఠశాల) వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు.

అండర్–17 విభాగం: రిజ్వానా(కేజీబీవీ(మైనార్టీ)), మమత(బీసీ గురుకులం), శివజ్యోత్స్న(దొడ్డనగేరి పాఠశాల) మూడు స్థానాలు దక్కించుకున్నారు.

నవంబర్ ఆఖరిలోగా లక్ష్యం చేరుకోవాలి

మంత్రాలయం: ఇళ్ల నిర్మాణాల్లో నవంబర్ ఆఖరిలోగా లక్ష్యాన్ని చేరుకోవాలని ఎంపీడీఓ మణిమంజరి సూ చించారు. శనివారం ఎంపీడీఓ సమావేశ భవనంలో మండల స్థాయి అధికారులతో హౌసింగ్పై సమీక్ష ని ర్వహించారు. ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెరగాలని హౌ సింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులందరు సమష్టి కృషితో లక్ష్యాన్ని అధిగమించాలన్నారు.అనంతరం మంత్రాలయం–ఎమ్మిగనూరు ప్రధాన రహదారి పక్కన ఉన్న జగనన్న కాలనీల్లో పర్యటించారు. ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. తహసీల్దార్ చంద్రశేఖర్, హౌసింగ్ డీఈ లాల్కృష్ణయ్య, పీఆర్ఏఈ నరసింహులు, ఎన్ఆర్జీఎస్ ఏపీఓ తిమ్మారెడ్డి, థర్డ్పార్టీ కాంట్రాక్టర్ శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

కోసిగి: మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో హౌసింగ్ ఏఈ శేఖర్బాబుతో కలిసి ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ శనివారం పర్యటించారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను దగ్గరుండి నిర్మించుకోవాలని సూచించారు. బిల్లులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు ఆన్లైన్లో అప్డేట్ చేయాలని సిబ్బందికి సూచించారు.

ఎస్టీయూ మండల కమిటీ ఏర్పాటు


మండల కమిటీ సభ్యులు

కౌతాళం: ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ నరసింహులు అధ్యక్షతన శనివారం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గురుసాగర్, ప్రధాన కార్యదర్శిగా తాయన్న, ఆర్థిక కార్యదర్శిగా ఖాదర్బాషా, గౌరవ అధ్యక్షుడిగా శ్రీనివాసులును ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర అదనపు కార్యదర్శి నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్, సీనియర్ నాయకులు మహదేవప్ప, గోపాల్, రామచంద్ర, చిన్న తిమ్మన్న, రామాంజనేయులు, ఆంజనేయ, బీరప్ప పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై రివ్యూ


మాట్లాడుతున్న డీఎల్డీఓ నాగేశ్వరరావు

ఆదోని రూరల్: సంక్షేమ పథకాలపై శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఎల్డీఓ నాగేశ్వరరావు, ఎంపీడీఓ గీతావాణి హాజరై మాట్లాడారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆయా గ్రామాలవారీగా ఆరా తీశారు. నిబంధనలు పాటించాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించుకోవాలని సిబ్బందికి సూచించారు. అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ విజయశేఖర్రావు, ఇన్చార్జ్ ఈఓపీఆర్డీ నాగరాజ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

● సమగ్రశిక్ష ఏపీసీ వేణుగోపాల్


విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్న ఏపీసీ వేణుగోపాల్

గోనెగండ్ల: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త వేణుగోపాల్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, గాజులదిన్నె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(హరిజనవాడ)ను తనిఖీ చేశారు. నాడు–నేడు పనులను పరిశీలించారు. నాణ్యత లోపించకుండా పనులు చేపట్టేలా చూడాలని అధికారులకు సూచించారు. కేజీబీవీ విద్యార్థినులను తరగతి గదులకు వెళ్లి ఉపాధ్యాయులు బోధించే విధానాన్ని పరిశీలించి, విద్యార్థినుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, సమయపాలన పాటించాలన్నారు. జూనియస్ గ్లోబల్ స్కూల్ను తనిఖీ చేసి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎల్కేజీ, యూకేజీ తరగతుల విద్యార్థుల జాబితాను ఆన్లైన్లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జీసీడీఓ సునీత, ఎంఈఓలు రామాంజనేయులు, నీలకంఠ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హరికథ పారాయణం


హరికథ పారాయణం చేస్తున్న కళాకారిణి

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల చాతుర్మాస దీక్ష సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో హరికథ పారాయణం, దాస సాహిత్య కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులోభాగంగా శనివారం హరికథ పారాయణం, దాస సాహిత్య విభావరి చేపట్టారు. ఈ కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 45 రోజుల పాటు దాస సాహిత్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఆలూరు విద్యార్థి


రవూఫ్

ఆలూరు రూరల్: రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఆలూరు ప్రభుత్వ పాఠశాల–1 విద్యార్థి రవూఫ్(9వ తరగతి) ఎంపికై నట్లు హెచ్ఎం వరప్రసాద్ శనివారం తెలిపారు. ఈ నెల 17న మద్దికెరలో సూపర్ సెవెన్ క్రికెట్ టీం అసోసియేషన్ నిర్వహించిన అండర్–17 జిల్లా స్థాయి క్రికెట్ పోటీలలో రవూఫ్ ప్రతిభ కనబరిచాడన్నారు. ఆదివారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు వైఎస్సార్ కడప జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు.

మేలైన గడ్డి జాతితో అధిక పాల దిగుబడులు

● పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వర ఆచారి


పెద్దకొత్తిలిలో సమీకృత దాణాను పంపిణీ చేస్తున్న ఏడీ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వర ఆచారి

నందవరం: పాడి రైతులు పశువులకు మేలైన గడ్డి జాతి అందించడంతో అధిక పాల దిగుబడి పొందవచ్చని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ) డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వర ఆచారి సూచించారు. శనివారం మండల పరిధిలోని జొహరాపురం, పెద్దకొత్తిలి గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో పశు వైద్యుడు నరేంద్రనాథ్ రెడ్డి నేతృత్వంలో పాడిరైతులకు మేలైన గడ్డి జాతి పెంపకంపై అవగాహన కల్పించారు. అనంతరం పాడి రైతులకు సమీకృత పశువుల దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీకృత దాణా వాడడంతో పశువులలో పాల దిగుబడి అధికంగా ఉంటుందన్నారు. రెండు క్వింటాల ధర రూ.3,160 కాగా ప్రభుత్వం రాయితీతో రూ.1,300లకే అందిస్తుందన్నారు. దూడల పెంపకంపై జాగ్రత్తలు పాటించాలన్నారు. పశువులకు సక్రమించే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి టీకాలు వేయించుకోవాలని సూచించారు.

26న వయోవృద్ధుల విస్తృతస్థాయి సమావేశం


మాట్లాడుతున్న ఎస్.గోపాల్రెడ్డి

ఆదోని టౌన్: ఈనెల 26న ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఎదురుగా ఉన్న మెట్రో ఫంక్షన్ హాల్లో వయోవృద్ధుల విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.గోపాల్రెడ్డి, సీనియర్ సిటిజన్లు దేవదాసు, పెద్దహరివాణం ఆదినారాయణరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక భీమాస్ లాడ్జిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీనియర్ సిటిజన్ల సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. 60 ఏళ్లు నిండిన వారు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

వైద్య శిబిరాలను ఉపయోగించుకోండి

వెల్దుర్తి: ఆయుష్మాన్ భవ వైద్య శిబిరాలను ప్రజలు ఉపయోగించుకోవాలని స్థానిక సీహెచ్సీ సూపరింటెండెంట్ బాలచంద్ర రెడ్డి సూచించారు. శనివారం సీహెచ్సీలో ఆయుష్మాన్ భవ క్యాంపు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ హాజరయ్యారు. సూపరింటెండెంట్, జెడ్పీటీసీ సభ్యుడు, వైద్యులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద, మధ్య తరగతి ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య పథకాలన్నీ అందించడమే ఆయుష్మాన్ భవ లక్ష్యమన్నారు. స్థానిక సీహెచ్సీ కేంద్రంగా ఈనెల 28, 30వ తేదీలలో క్యాంపులు ఉంటాయన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్సీ వైద్యులు అలిసాబ్, సాహితి, హేమలత, రంగస్వామి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి


మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ, ఎంపీడీఓ

కౌతాళం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ లాలికృష్ణయ్య, ఎంపీడీఓ సుబ్బరాజు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో పెండింగ్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. అనంతరం వారు తోవి, కుంటనహాల్, ఎరిగేరి గ్రామాల్లోని జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. వారి వెంట ఏఈ శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆదోనికి చేరుకున్న దళిత రక్షణ యాత్ర


మాట్లాడుతున్న ఆనంద్బాబు

ఆదోనిరూరల్: దళితులను చైతన్యం చేయడం కోసం కేవీపీఎస్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దళిత రక్షణ యాత్ర శనివారం ఆదోని పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా తిమ్మారెడ్డి బస్టాండు ఆవరణలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.ఆనంద్బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29న విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాకు దళితులు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, జిల్లా సహాయకార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● కౌతాళం: దళితులపై దాడుల్ని అరికట్టాల కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ అన్నారు. దళిత రక్షణ యాత్ర కౌతాళం చేరుకున్న సందర్భంగా వారు మాట్లాడారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, కౌతాళం సర్పంచ్ పాల్దినకర్, కామవరం సర్పంచ్ వసంత, కౌతాళం మాజీ సర్పంచ్ అవతారం పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

వెల్దుర్తి: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్కుమార్ శనివారం తనిఖీ చేశారు. స్థానిక ఏఓ అక్బర్బాషాతో కలిసి ఆయన దుకాణాల్లోని రిజిస్టర్లు, అనుమతి పత్రాలు, స్టాకు బోర్డులు, నిల్వలు పరిశీలించారు. నిబంధనలు పాటించి, రైతుల ఆధార్ అనుసంధానంతో కూడిన ఈ పాస్ మిషన్తో, అనుమతి ఉన్న ఎరువులను మాత్రమే విక్రయించాలని, కొనుగోలుదారులకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని దుకాణదారులను ఆదేశించారు.

నవంబర్ చివరిలోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

ఆదోని రూరల్: ఇళ్ల నిర్మాణాలు నవంబర్ చివరిలోపు పూర్తి కావాలని డీఎల్డీఓ నాగేశ్వరరావు, ఎంపీడీఓ గీతావాణి థర్డ్ పార్టీ కాంట్రాక్టర్లకు సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన థర్డ్ పార్టీ కాంట్రాక్టర్లతో ప్రత్యేకంగా సమావేశమై నిర్మాణ పనుల గురించి చర్చించారు. నిర్మాణంలో ఆయా దశల్లో ఉన్న వాటిని ఎందుకు పూర్తి చేయకుండా ఆలస్యం చేస్తున్నారనే విషయంపై చర్చించారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరవుతున్నాయని, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేయకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం హౌసింగ్ డేను పురస్కరించుకుని పెద్దతుంబళం గ్రామంలో లేఅవుట్ను సందర్శించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ రవికుమార్, ఇన్చార్జ్ ఈఓపీఆర్డీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈలు, వర్క్ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా మేళా


చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాల్లో చేనేత హస్తకళా మేళా ఆకట్టుకుంటోంది. స్థానిక చేనేత వస్త్రాలతో పాటు పోచంపల్లి, మంగళగిరి, వెంకటగిరి, ధర్మవరం, గద్వాల పట్టు, కాటన్, కలంకారి శారీస్, షర్టులు, కొండపల్లి, ఏటికొప్పాక చెక్కబొమ్మలు ఉన్నాయని, కొనుగోలు చేసి నేత కార్మికుల నేత వృత్తిని ప్రోత్సహించాలని నిర్వాహకులు శేషుబాబు, నారాయణ ప్రజలను కోరారు. ఈనెల 28వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.

వచ్చే నెల 15 నుంచి విజయ దశమి ఉత్సవాలు

● దేవరగట్టు ఆలయ చైర్మన్ శ్రీనివాసులు

ఆలూరు: హొళగుంద మండలం దేవరగట్టు ఆలయంలో వచ్చే నెల 15వ తేదీ నుంచి విజయ దశమి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 24న విజయదశమి (కర్రల సమరం బన్నీ) ఉండటంతో రోడ్లు, తాగునీరు, విద్యుద్దీకరణ, మరుగుదొడ్లు తదితర ఏర్పాట్లపై ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అర్చకులతో చర్చిస్తామన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి


ఇన్చార్జ్ ఎంపీడీఓ ప్రభాకర్కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ నాయకులు నాగరాజు, భీమన్న, శాంతప్ప డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని మడల పరిషత్ కార్యాలయం ముందు ఇన్చార్జ్ ఎంపీడీఓ ప్రభాకర్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 17 ఏళ్లుగా ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా ఉన్నామన్నారు. తమ కష్టాన్ని గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అర్హత కలిగిన వారికి ప్రమోషన్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు గంగన్న, నాగేష్, మల్లికార్జున, మధు పాల్గొన్నారు.

ఎల్లార్తి దర్గాల హుండీ కానుకల లెక్కింపు


కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

హొళగుంద: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాల హుండీలో మూడు నెలలుగా భక్తులు వేసిన కానుకలను శనివారం లెక్కించారు. రూ.9.05లక్షల ఆదాయం వచ్చినట్లు డిస్ట్రిక్ మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్(డీఎండబ్ల్యూఓ) సబియా పర్వీన్ తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ఈఓ అబ్దుల్ రహిమాన్, ఆదోని, నంద్యాల డివిజన్ల వక్ఫ్బోర్డు ఆడిటర్ అండ్ ఇన్స్పెక్టర్లు అల్తాఫ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

25న హుండీ కానుకల లెక్కింపు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో వెలసిన ప్రసిద్ధ శ్రీరంగనాథస్వామి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను ఈనెల 25న లెక్కించనున్నట్లు ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్రెడ్డి శనివారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న భక్తులు పంచ, కండువా ధరించి లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు.

నాణ్యత పాటించాలి

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. శనివారం 6వ వార్డులో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఎన్టీఆర్ కాలనీ వార్డు సచివాలయాన్ని తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు. సంక్షేమ పథకాల పోస్టర్లను, లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు.

నూతన సంస్కరణలు వద్దు

● మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ఆలూరు: ప్రభుత్వ విద్యావిధానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన సంస్కరణలను అమలు చేయడం వల్ల పేద విద్యార్థులు చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయనంద్ అన్నారు. స్థానిక ఎల్లార్తి రోడ్డు సమీపంలో ఇబ్రహీమ్ ఫంక్షన్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్షుడు రంగన్న, కార్యదర్శి అబ్దుల్లా, నాయకులు అమర్, రవి, పోతురాజ్ తదితరులు పాల్గొన్నారు.